


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### పెళ్ళివారమండీ.......2

**పెళ్ళివారమండీ.....** అంటూ మా అక్క పెళ్ళి వారం రోజుల హడావిడిలో ఎలా చేసామో చెప్పాను కదా! అది రాసిన వేళా విశేషమో ఏమో...... పోయిన నెలలో అమెరికాలోని కాలిఫోర్నియాలో శానోజే సిటీలో నివసించే దాని ఒక్కగానొక్క కొడుకు పెళ్ళి వారం రోజుల్లో జరిగిపోయింది! అంటే. అబ్బాయి అమెరికా నుండి రావడం, అమ్మాయి లండన్ నుండి రావడం, చూసుకోవడం, పెళ్ళి చేసుకోవడం, తిరిగి అమెరికా వెళ్ళిపోవడం వారం వ్యవధిలో జరిగిపోయింది.

చిన్నప్పుడు ఆదివారం నాడు అరిటి నాటాము. సోమవారం నాడు సుడి వేసి పెరిగింది....అని చదివినట్లు ఈ మధ్య మూడు రోజులూ, లేదా 24 గంటలూ వ్యవధిలో పెళ్ళిళ్ళు జరిగిపోతున్నాయి! అదీ తూ.........తూ మంత్రంగా కాదండోయ్...... అదిరిపోయేటట్లు! అదరడం ఎవరికి అంటారా? చెప్తా వినండి........ ఇదివరకు పెళ్ళిళ్ళు ఎలా జరిగేవి? వీలైతే ఇంటి ముంగిట్లో పందిరేసి. లేదా ఏ సత్రంలోనో, కొన్నిసార్లు పుణ్యక్షేత్రాలలో లేదా గుళ్ళల్లో.......... కానీ ఇప్పుడు అలా కాదు!

గొప్పా, మధ్య తరగతీ బేధం లేకుండా ఐదు నక్షత్రాల హోటళ్ళలో, లేదా పూటకి రెండు లక్షలు పుచ్చుకునే మేరేజ్ హాల్స్‌లో జరుగుతున్నాయి.

మేరేజ్ హాల్స్‌కి అంత అద్దెలు ఎందుకు అంటారా?...... మరి ఆరు ఎయిర్ కండీషన్డ్ రూమ్ము, సెంట్రల్లీ ఎయిర్ కండీషన్డ్ మండపం వగైరా..... ఉండాలి కదా! ఇంక వాళ్ళ కండీషన్స్ ఏమిటంటే, వాళ్ళ స్టాఫే ఈవెంట్ మేనేజ్‌మెంట్ చేస్తారు! అంటే మా పెద్దక్క పెళ్ళిలో నేను చెప్పిన సరోజిని అమ్మమ్మలూ, సత్యవతి పిన్నాయిలూ......... పెద్ద మావయ్యలూ అఖ్ఖర్లేదనమాట! ఇంక వంటా, వడ్డనా, అలంకరణా, పలకరింపులూ, చిలకరింపులూ, అచ్చటా, ముచ్చటా అన్నీ వాళ్ళే!........ అంటే ఇంకా విపులంగా చెప్పాలా?

ఇదివరకు మనం ఎవరిళ్ళకన్నా పెళ్ళిళ్ళకి వెళితే ఏం జరిగేదీ? మగపెళ్ళివారం అయితే..... సదరు ఆడపెళ్ళివారు తరపువాళ్ళు వచ్చి బొట్లు పెట్టి, మన మీద పన్నీరు చిలకరించి "భోజనాలకి రండి...." అని పిలిచేవారు. అప్పటికే కొందరు మూతులు తిప్పి, మాకు బొట్టుపెట్టలేదనీ, గంగా భాగరథీ సమానురాలైన పెద్దత్తకి బొట్టుపెట్టేసారనీ అలిగేవారు......... అది వేరే విషయం కానీ ఇప్పుడా ముచ్చటంతా సదరు ఈవెంట్ మేనేజ్‌మెంట్ భామలే చేస్తారు!

ఒకే రకమైన సూట్లతో, లేదా ఎయిర్ హోస్ట్‌లని తలపించే వస్త్రధారణతో, "ఒకటే మా సొగసూ......." అన్నట్లుండే అమ్మాయిలు మనని సాదరంగా ఆహ్వానించి, రాగానే మన నోళ్ళల్లో నారింజ లేదా, పసుపు రంగు నీళ్ళు. అనగా కాన్‌సన్‌ట్రేటెడ్ జ్యూసులు పోసి, ఆ తర్వాత పన్నీరు చిలకరించడాలు..... ఒక గిరగిరా తిరిగే మిషన్ ద్వారా చేయించి, అంటే ఫ్యాన్ లాంటి దాని ముందు నిలబడితే మనం నిలువెల్లా పన్నీటి వానలో తడిసి ముద్ద అవుతాం అన్నమాట! ఇలాంటి స్వాగతాలతో పెదవుల మీద ఒకే లాంటి ప్లాస్టిక్ చిరునవ్వులతో మనని ఆహ్వానిస్తారు!

ఇంక ఆహ్వానించారు కదా......... మీరు చుట్టూ చూస్తారు... మీ ఆత్మీయులకోసం.... తెలిసిన వాళ్ళ కోసం... కానీ వాళ్ళని మీరు గుర్తు పట్టే స్థితిలో ఉండరు. అమ్మాయిలంతా లంగా ఓణీకీ, ఘాగ్రా చోళీకీ మధ్యస్తంగా.... ఒక డాన్స్ డ్రెస్ వేసుకుంటారు. పైట ఉంటుంది కానీ ఉండాల్సిన చోట కాదు.. పరికిణీ ఉంటుంది కానీ అది పరికిణీలా ఉండదు! మొత్తానికి మొహాలకి మేకప్పులతో ఏ డాన్స్ ఫ్లోర్‌కో, సినిమా సెట్స్ మీదకో వచ్చిన అనుభూతి కలిగిస్తుంటారు. "ఇది మన బుజ్జక్క కూతురు డాలీ అ[ర్రా........" అంటే గుర్తుపట్టలేం! నిన్న మొన్నటిదాకా చింపిరి తలతో, ముక్కు చీవిడి కారుతూ తిరిగిన పిల్ల వయసురాగానే కరీనా కపూర్‌లా అయిపోతుందన్నమాట! ఇంక బ్రైడల్ మేకప్పులూ, బ్యూటీ క్లినిక్‌లూ పుణ్యాన పెళ్ళి కూతుళ్ళంతా ఒకేలా ఉంటారు. వాళ్ళ అసలు స్వరూపాలు తర్వాత ఎప్పుడో వాళ్ళ ఇళ్ళల్లో నిద్రలేచినప్పుడే కనిపిస్తాయి. మగవాళ్ళంతా లాల్చీ పైజమాలూ, భుజాన కండువాలతో, మన ఆంధ్రా ఉత్తరీయాలకీ, ఉత్తరాది పైజమాలకీ పెళ్ళిళ్ళు చేసినట్లున తమాషా డ్రెస్సుల్లో కానీ, మే నెల ఉక్కతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నా సూట్లలో కానీ సతమతమవుతుంటారు.

ఇంక మీరు పైన ఫ్యాన్ కోసం వాసాలు లెక్కపెట్టకుండా సెంట్రల్లీ ఎయిర్ కండీషన్డ్ కాబట్టి ఒక చోట సెటిల్ అవుతారు. పెళ్ళి చూద్దామని ఎంతో ప్రయత్నిస్తారు. కానీ, పెళ్ళికూతురూ, పెళ్ళికొడుకూ పీటల మీదకి రాగానే, దడికట్టినట్లు వివిధ సైజుల్లో అబ్బాయిలు కెమేరాలతో, వీడియో కెమేరాలతో మన ముందు నిలబడతారు. మనం వీళ్ళ వీపులు తప్ప ఏమీ చూడలేం! గొప్ప గొప్ప వాళ్ళు అందుకే సైడ్‌కి మానిటర్లు పెట్టి పెళ్ళంతా టీ.వీల ద్వారా వేంకటేశ్వర కళ్యాణంలా చూపిస్తారు! అది లేని వాళ్ళు పెళ్ళికి వచ్చామన్న సంతృప్తితో, గట్టి మేళం మోగగానే చేతిలోని అక్షింతలని కూర్చున్న చోటునుండే విసిరి పారేస్తే అవి మధ్యలో వాళ్ళ బుర్రల నిండా పడతాయి.

అంతటితో ఆ ఘట్టం అయిపోయింది ఇంక భోజనాలే అనుకుంటే, బిర్యానీలో కాలేసినట్లే! అసలు ప్రహసనం అప్పుడు ప్రారంభం అవుతుంది. అదేవిటంటే వయసులో ఉన్న కుర్ర బ్యాచ్ అంతా హాల్ అదిరిపోయే సౌండ్‌తో "కజరారే.......కజరారే......" అని డాన్స్ మొదలు పెడతారు. కొంచెం మొహమాటంగా ఉన్న మావయ్యలనీ, అత్తయ్యలనీ లాగుతారు! వాళ్ళూ డాన్స్ మొదలు పెడతారు. ఆ తర్వాత నలభై ఏళ్ళ వాళ్ళూ, ఆ పైన ఇంకా తలనెరిసిన వాళ్ళూ, పెళ్ళి కూతురు తల్లి తండ్రులూ, పెళ్ళి కొడుకు తల్లి తండ్రులూ...... పెళ్ళికొచ్చిన ప్రతివాళ్ళూ నృత్యం మొదలు పెడతారు........ వీళ్ళంతా ఎక్కడ నేర్చుకున్నారని ఆశ్చర్యపోతున్నారా? ఎక్కడా నేర్చుకో

అక్కరలేదు....... మనం చిన్నప్పుడు జాతరలలో చూడలేదూ? పోతరాజులు ఎగురుతుంటే, వాళ్ళకి వచ్చిన రీతిలో పిల్లలూ ఎగిరేవారు. చేతులు పైకి పెట్టి, ఒక కాలు మార్చి ఒక కాలుతో ఎగరడం, కింద నుండి పై దాకా జ్యోతిలక్ష్మిలా షేక్ చెయ్యడం....... అన్నమాట! అంతా మంచి మజాగా ఉంటుంది. తర్వాత రోజు తొడల్లో, పిక్కల్లో బిళ్ళలు కట్టి ఆఫీసులకి వెళ్ళలేరు అది వేరే మాట! ఇలా రకరకాల తెలుగు, హిందీ, వెస్టన్, పంజాబీ పాటలకి ఒళ్ళు హూనం అయ్యేదాకా డాన్సులు చేస్తారు. ఈ లోగా మనని ఎవరూ పట్టించుకునే దిక్కు లేరని తెలిసి కొంతమందిమి భోజనశాల వైపు వెళతాం!

ఇంక అక్కడ 'మాయాబజార్' కనిపిస్తుంది.

అక్కడే పొయ్యిలు పెట్టి ఉత్తరాది చాట్ లూ, దక్షిణాది పలహారాలూ, చిత్రవిచిత్రమైన కూరలు ఎందుకన్నానంటే ఆలూ పన్నీర్, గోబీ ఆలూ, పన్నీర్ మటర్, పన్నీర్ మసాలా, మిక్స్‌డ్ వెజిటబుల్ పన్నీర్, కాప్సికమ్ పన్నీర్, నవరతన్ కుర్మా అన్నీ ఒకేలాంటి వాసనలతో, కొంచెం ఒకే రుచితో అర్థం కాకుండా ఉంటాయి! 'నాన్' అనబడే రబ్బర్ పదార్థంలాంటి రోటీలు, మసాలా పూరీలూతో బాటు మన మిరపకాయ బజ్జీలూ, పెసరట్లు, ఆలూ బోండాలూ, దోసకాయ పప్పూ, వంకాయ కూరా, సాంబారు కూడా ఉంటాయి. ఇంక స్వీట్లు కూడా అక్కడే బాండీ పెట్టి మన మొహం మీదే వేడి వేడిగా జిలేబీలూ, జాంగ్రీలు వేస్తారు. కొందరు 'తవ్వా'స్వీటు అని, ఏ స్వీటు అయినా, ఉదాహరణకి గులాబ్ జామ్, రసగుల్లా, మైసూర్ పాక్, బాదుషాలాంటివి బాండీలో పాలలో వేసి చితక్కొట్టి, బాగా నెయ్యి వేసి మనకి ఒక దొన్నెలో పెడతారు! ఆ పైన రకరకాల ఫ్రూట్స్.... ముక్కలు కోసి, ఐస్‌క్రీమ్స్...... ఇలా మన జీవితానికి సరిపడే ఫుడ్ అంతా ఒకే చోట కనిపిస్తుంది! ఇంక 'మాయాబజార్' వంటకాలు ఎందుకు పనికి వస్తాయో చెప్పండి!

మర్నాడు మా మంతెన సత్యనారాయణ రాజుగారు వేడినీళ్ళల్లో తేనె వేసుకుని ఆరారగా తాగి ఉపవాసం చెయ్యమంటారు. దాంతో పోనివ్వరు.. రెండో రోజూ, మూడో రోజూ జ్యూస్, కొబ్బరి నీళ్ళమీదా ఉండమంటారు........... ఆ! ఆయన అంటారు........... మనం చేస్తామని కాదు!

ఇదీ పెళ్ళి విందు! ఇంక ఇందాక ఓ విషయం చెపుతూ ఆగిపోయాను. అదీ పెళ్ళిళ్ళలో అలకలు......... సాధారణంగా 'అలకపానుపు' లేకుండా ఇదివరకు రోజుల్లో పెళ్ళిళ్ళు జరిగేవి కావు!

ఆడపెళ్ళివారు ఎవరో కూడా మనకి తెలీదు....... పెళ్ళికూతురు తల్లి పనుల్లో అలుకులాడిపోతూ, వేలిముడితో పట్టు చీరలో, చీర పైకి ఎగ్గట్టి చెమట్లు కారుతూ తిరగదు! ఆడపిల్లతండ్రి హడావిడి పడుతూ ఒంగి నమస్కారాలు పెడుతూ మర్యాదలు చేస్తూ మనకి కనిపించడు! అంతా ఒంటి మీద బట్ట నలక్కుండా, హిందీ సినిమాల్లో హీరోహీరోయిన్లలా......... స్టైలుగా హుందాగా నిలబడి ఉంటారు.

స్టేజ్ ఎక్కితే మనతో బాటు ఓ ఫోటోకి స్టిల్ ఇస్తారు. గుంపులో గోవిందగా జొరబడి ప్లేట్ సంపాదించామా భోజనం పూర్తి చేస్తాం! అప్పటి అలకల బదులు ఇప్పటి కులుకులు మనని అలరిస్తాయి. ఇదే మంచి పద్ధతి.

మా పెద్దక్క పెళ్ళిలోలా వంట బ్రాహ్మడు బంగారం పన్ను క్రిష్ణమూర్తితో పేచీలు ఉండవు.... ఏనుగు తలకాయంత విఘ్నేశ్వరుడి లడ్డూ చేసి, అది బ్రాహ్మడి కొస్తుందని పీట కింద దాచేసే వంట వాళ్ళు కనిపించరు. చింతపండు గుజ్జు పొయ్యి వెనక కుక్కి దుబారా చేసాడని పోట్లాడే అమ్మమ్మలు అక్కర్లేదు!

ఒళ్ళు హూనం అయ్యేలా షాపింగులు అక్కర్లేదు. ఏ.సీ. షాపింగ్ మాల్స్‌లో గాజుగ్లాసుల్లో ద్రాక్షరసాలూ, కాఫీలూ అందిస్తూ మనకి అలసట తెలియకుండా బిల్లు పేలిపోయే లాంటి వస్త్ర మరియూ నగల సంయుక్త అంగళ్ళు ఉంటాయి!

డబ్బులు బ్యాగుల్లో పెట్టుకుని వాటిని కాపాడుకుంటూ ఎండల్లో ఆటోల్లో షాపింగులు చేసేవాళ్ళం! ఇప్పుడు 'క్రెడిట్ కార్డు' జేబులో పెట్టుకుని 'దునియా' కొనేయచ్చు! ఫోన్ ముందు పెట్టుకుని 'ఎల్లో పేజెస్' చూస్తూ వీడియో, హాలూ, కేటరింగూ, ఫ్లవర్ ఎరేంజ్ మెంటు, బ్రైడల్ మేకప్పూ అన్నీ బుక్ చేసేయచ్చు! ఆల్‌మండ్ హౌస్ వాళ్ళు సారె కూడా అందంగా అలంకరించిన ప్యాకేజీల్లో ఇచ్చేస్తారు. ఇక నెక్స్ట్ శోభనానికి స్పెషల్ ప్యాకేజీలలో స్టార్ హోటల్స్ లో 'సూట్లు', హనీమూన్ టూర్లూ........

'పైసామే హై పరమాత్మా'. ఆడపిల్ల పెళ్ళి, మగపిల్లాడి రిసెప్షనూ...... అన్నీ అయ్యాక 'స్టార్స్' కనిపిస్తున్నాయి. అందుకే వాటిని 'స్టార్ హోటల్స్' అన్నారని ఇప్పుడు అర్థం అవుతోంది.

చూసారుగా.......... వారం ముందుగా ఆంధ్రానుండి వస్తూ మా పెద్దక్క పెళ్ళికి బంధువులంతా తలోటీ పట్టుకొచ్చారు. రాజమండ్రి నుండి విసిన కర్రలూ, కడియం నుండి పూలూ, అనకాపల్లి కొత్త బెల్లం, అమలాపురం నుండి కొబ్బరికాయలూ, నరసాపురం నుండి కర్పూరం దండలూ, వగైరా.......... వారం పాటు ఇరుగు పొరుగులతో సహా అప్పడాలు వడియాలు పెట్టి, మినపసున్నీ, మైసూర్ పాకాలు చేసి అలిసి పోయారు........

అదే.... ముప్ఫై ఏళ్ళ తర్వాత తన కొడుకు పెళ్ళి 'మంగళవారం దిగి ఆదివారం' చేసుకుని వెళ్ళిపోయేటట్లు జరిగింది. అదీ అట్టహాసంగా..........

కాలం ఎంత మారిపోయిందో కదా!

'ఉందిలే మంచీ కాలం ముందూ ముందూనా......... అందరూ సుఖపడాలీ నంద నందానా................' అన్నది ఇందుకే అన్నమాట!